సాక్షి
పల్నాడు

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



జడ్జి ఆపన్నహస్తం

భట్టిప్రోలు: ఓలేరు పల్లెపాలెంలో 100 వరద బాధిత కుటుంబాలకు గురువారం గుంటూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి పార్థసారథి దుప్పట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ పాల్గొన్నారు.



పులిచింతలలో43 టీఎంసీల నిల్వ

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టు 2 గేట్లను మూడు మీటర్లు ఎత్తి 83,877 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 43 టీఎంసీలు నిల్వ ఉంది.



50,049 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 47,159 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 50,049 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

రేపు జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్. సత్యశ్రీ గురువారం తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకొని తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని కోరారు. సివిల్ కేసులు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నట్లయితే కోర్టు ఫీజు వాపసు చేయబడుతుందన్నారు.

డబ్లింగ్ పనుల కోసం సర్వే



దాచేపల్లి: రైల్వే డబ్లింగ్ పనులకు సంబంధించిన సర్వేను గురజాల ఆర్డీఓ ఎస్.రమాకాంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. నడికుడి నుంచి పగిడిపల్లి వరకు రైల్వే డబ్లింగ్ పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో దాచేపల్లి మండల పరిధిలోని నడికుడి నుంచి పొందుగల వరకు రైల్వే డబ్లింగ్ పనులకు ఎన్ని ఎకరాల భూమి అవసరం అవుతుందనే అంశంపై రెవెన్యూ, రైల్వే అధికారులు సర్వే చేపట్టారు. ఈ సర్వేను ఆర్డీఓ పరిశీలన చేసి పలు సూచనలు చేశారు. డబ్లింగ్ పనుల కోసం సుమారుగా 100 ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. వీటిల్లో కొంత ప్రభుత్వ భూమి, మరికొంత పట్టా భూమి కూడా ఉందని తెలిపారు. త్వరితగతిన సర్వే పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఆర్డీఓ చెప్పారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ వైవీ.కుటుంబరావు, సర్వేయర్ శ్రీనివాసరావు, రైల్వే అధికారులు ఉన్నారు.

ఓపెన్ స్కూల్‌కు 15 తుది గడువు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియేట్ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 15వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులు అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, విద్యాపీఠం జిల్లా సమన్వయకర్త కె.ఎం.ఏ.హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుం రూ.200లతో ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందచేయవచ్చని వివరించారు. జిల్లాలోని డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, ఏఐ కో-ఆర్డినేటర్లు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి 2022 నుంచి 2024 మార్చి వరకు పదో తరగతిలో ఉత్తీర్ణత పొందని వారిని గుర్తించి ఓపెన్ స్కూల్‌లో (దూరవిద్య) చేరేలా కృషి చేయాలని తెలిపారు. 14 సంవత్సరాల వయస్సు నిండి బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి ఓపెన్ స్కూల్‌లో చేరేలా అవగాహన కల్పించాలని కోరారు.

ఎస్‌జీఎఫ్ఐకి ఇరువురు కేంద్రియ విద్యార్థినులు ఎంపిక



నాగతేజస్విని



శ్రీలక్ష్మి

సత్తెనపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ)కి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని కేంద్రియ విద్యాలయ విద్యార్థినులు ఇరువురు ఎంపికైనట్లు పీఈటీ బి.కిరణ్‌రెడ్డి గురువారం తెలిపారు. జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన టెన్త్ విద్యార్థిని కె.త్రిపుర నాగతేజస్విని, ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎస్.శ్రీలక్ష్మి ఎంపిక య్యారన్నారు. ఇరువురు విద్యార్థినులను కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపల్ జగదీష్‌కుమార్ గుప్తా, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు అభినందించారు.

దెబ్బతిన్న పుష్కర ఘాట్లు



తాడేపల్లి రూరల్ : వరద ప్రవాహానికి కృష్ణా పుష్కర ఘాట్లు ధ్వంసం అయ్యాయి. ఇటీవల ప్రకాశం బ్యారేజీకు ఎగువ నుంచి వరద రావడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు నీటిని దిగువకు వదిలారు. దీంతో సీతానగరంలోని పుష్కర ఘాట్లు దెబ్బతిన్నాయి. నీటి ఉధృతికి 30 చోట్ల టైల్స్ కొట్టుకుపోయాయి. ప్రతి ఘాట్‌లోను మెట్లకు పగుళ్లు ఏర్పడ్డాయి.

నీట్ ఆశలపై కూటమి పిడుగు!

- కోటి ఆశలతో పోటీ పడుతున్న విద్యార్థులకు శరాఘాతం
- మెడికల్ విద్యను పేదలకు దూరం చేసేందుకు చంద్రబాబు కుట్ర
- ఆందోళనలో నీట్ విద్యార్థులు, తల్లిదండ్రులు
- ప్రభుత్వ మెడికల్ కళాశాలల వల్ల అందుబాటులోకి రానున్న సూపర్ స్పెషాలిటీ వైద్యం

మెడికల్ విద్యను ప్రైవేట్ పరం చేస్తూ కూటమి ప్రభుత్వం అడుగులు



పిడుగురాళ్లలోని మెడికల్ కళాశాలలో గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం పూర్తయిన ఓ బ్లాక్

సాక్షి, నరసరావుపేట: పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు డాక్టర్ కావాలనుకునే కలను చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఛిద్రం చేస్తోంది. తక్కువ ఖర్చుతోనే ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డాక్టర్ విద్యను అభ్యసించాలనుకునే నీట్ విద్యార్థుల ఆశలపై కొత్త ప్రభుత్వం నీళ్లు చల్లుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన 17 మెడికల్ కళాశాలను నిర్వీర్యం చేసి ప్రైవేట్‌కు కట్టబెట్టి, వైద్య విద్యను సామాన్యులకు అందుబాటులో లేకుండా చేసే విధంగా చర్యలు చేపడుతోంది. నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాలను ఆపివేదయం, కొత్త మెడికల్ కళాశాలలకు నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నుంచి అనుమతులు పొందిన సీట్లను అడ్డుకోవడం లాంటి చర్యల వల్ల మెడిసిన్ చదవాలనుకునే విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. కోటి ఆశలతో నీట్ కోసం పోటీపడుతున్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వ నిర్ణయాలు శరాఘాతంగా మారాయి. మెడికల్ విద్యను ప్రైవేట్‌పరం చేస్తుండటం పట్ల నీట్ విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే మెడికల్ విద్యను ప్రైవేట్ పరం చేయాలనుకునే నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నెమ్మదించిన పిడుగురాళ్ల మెడికల్ కళాశాల పనులు

వెనుకబడిన పల్నాడు ప్రాంతానికి గత ప్రభుత్వం ఇచ్చిన గొప్ప బహుమానం పిడుగురాళ్ల మెడికల్ కళాశాల. ఈ కళాశాల వల్ల పల్నాడు ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీని వల్ల హైదరాబాదు, గుంటూరు లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఉండదు. పిడుగురాళ్ల మండలం కామేపల్లి శివారులో 47 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.500 కోట్ల వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగంగా సాగాయి. ఈ కళాశాల ఏర్పాటుతో 100 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. నర్సింగ్ కళాశాల, 500 పడకల సూపర్ స్పెషాల్టీ వైద్యసేవలు ఈ ప్రాంత ప్రజలకు చేరువకానున్నాయి. ఎంబీబీఎస్ మొదటి ఏడాది ఆడ్మిషన్లు 2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించే విధంగా ప్రణాళికలు అమలుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పిడుగరాళ్ల మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తిగా నెమ్మదించాయి. నిర్మాణ సంస్థకు చెందిన పలువురు ఇంజినీర్లు ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వ చర్యల వల్ల మెడికల్ కళాశాల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

మా కల నెరవేరదు



నా కూతురు రెడ్డి భార్గవి ఇటీవల నీట్ పరీక్షల్లో 4,946 ఆలిండియా ర్యాంకు వచ్చింది. మాది మధ్య తరగతి కుటుంబం. కార్పొరేట్ కళాశాలల్లో చదివితే డబ్బులు ఖర్చు అధికంగా అవుతుంది. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పెంచటం మధ్య తరగతి పిల్లలు డాక్టరు కావాలనే కల నెరవేరుతుంది. కార్పొరేట్ కళాశాలల్లో మధ్య తరగతి పిల్లలు చదువుకోవటానికి ఆర్థిక స్తోమత సరిపోదు, ప్రభుత్వ కళాశాలలు ప్రారంభించి సీట్లు పెంపుదల చేయడంతో మధ్య తరగతి విద్యార్థులు ఎక్కువ మంది డాక్టర్లు కావటానికి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. తద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

–రెడ్డి కృష్ణ, నీట్ విద్యార్థిని తండ్రి, శావల్యాపురం

పునరాలోచించాలి



మా అమ్మాయి సయ్యద్ గౌసీయా అఫ్సర్ ఈ ఏడాది నీట్ పరీక్ష రాసింది. కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమైతే మా అమ్మాయికి ఎంబీబీఎస్ సీటు ఖచ్చితంగా వచ్చే అవకాశం ఉంది. కానీ నూతన కళాశాలలో అడ్మిషన్లు జరగకపోతే సీటు కోల్పోయే ప్రమాదముంది. ప్రభుత్వం స్పందించి కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణాలు పూర్తిచేసి, పూర్తిస్థాయిలో అడ్మిషన్లు చేపట్టాలి. అప్పుడే మన రాష్ట్ర నీట్ విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. ముఖ్యంగా నూతనంగా ఏర్పాటు చేయబోయే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం చేసే అంశంపై కూటమి ప్రభుత్వం పునరాలోచించి విరమించుకోవాలి.

–సయ్యద్ ఉస్మాన్, మాజీ సైనికుడు, నరసరావుపేట

పేదింటి పిల్లలకు శరాఘాతం



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను అడ్డుకొని, ప్రైవేట్ విద్యను ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం బాధాకరం. ఈ నిర్ణయం మెడికల్ విద్య చదవాలనుకే పేదింటి పిల్లలకు శరాఘాతం. దీనిపై పునసమీక్షించి నీట్ కోసం కష్టపడుతున్న విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి.

–చెవుల ప్రసన్నకుమార్, నీట్ విద్యార్థిని తండ్రి, రాజుపాలెం

జగన్ నిర్ణయం గొప్పది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఓ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండాలన్న ఆలోచనతో రాష్ట్రంలో 17 కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణాలు ప్రారంభించింది. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వచ్చి ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి రానుంది. స్థానిక విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు పొందే అవకాశం కలిగించారు. వీటిని నిర్వీర్యం చేసేలా కొత్త ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను మార్చుకోవాలి.

–పాపాబత్తుల మాణిక్యారావు, ముప్పాళ్ల

స్వచ్ఛతాహి సేవకు ప్రణాళికలు సిద్ధం చేయండి

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



వీడియా కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, తదితరులు

నరసరావుపేట: జిల్లాలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం విజయవంతానికి కావాల్సిన ప్రణాళికలు ఈనెల 17 నాటికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ స్వచ్ఛతా హి సేవా-2024పై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియా కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి కమిటీతో మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం మొదలు అవుతుందని అన్నారు. ఇది ముఖ్యంగా మూడు ప్రధాన అంశాలపై ఉంటుందని, అది స్వచ్ఛతాకి బాగిదారి, సంపూర్ణ స్వచ్ఛతా, ట్రాన్స్ ఫార్మేషన్ ఆఫ్ సీటీయూ, సఫాయి మిత్ర సురక్ష షివిర్స్‌గా ఉంటాయన్నారు. జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందన్నారు. డీఆర్‌డీఏ, డ్వామా అధికారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాటర్ బాటిళ్లు, టైర్లు, ఇతర వ్యర్థాల నుంచి కళాకృతులు ఏర్పాటుచేసి అవసరమైన ప్రధాన కూడళ్లలో ఉంచేలా చూడాలన్నారు. నియోజకవర్గానికి ఒక నగర వనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా స్వచ్ఛతపై అవగాహన కల్పించాలన్నారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు, సీపీవో శ్రీనివసరావు, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, డీపీవో భాస్కరరెడ్డి, ఐసీడీఎస్ అధికారి ఉమా రాణి, సాంఘిక సంక్షేమ అధికారి ఓబుల్ నాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డకు ఉక్కపోత

- గైనిక్ వార్డులో పనిచేయని ఫ్యాన్లు
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న బాలింతలు
- అద్దెకు ఫ్యాన్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి
- అధ్వాన పారిశుద్ధ్యంతో అవస్థలు
- నరసరావుపేట ప్రభుత్వాస్పత్రిలో సౌకర్యాలు నిల్

ప్రభుత్వాస్పత్రి గడప తొక్కిన నిండు గర్భిణులు సమస్యల ఉక్కపోతతో విలవిలలాడుతున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల వైపు కన్నెత్తి చూడలేని అభాగ్యులు ప్రసవం కోసం ప్రభుత్వాస్పత్రికి వస్తుంటారు. మాతాశిశు సంరక్షణ గదిలో కనీసం ఫ్యాన్లు కూడా లేక తల్లీబిడ్డ అల్లాడుతున్నారు. చేసేదేమీలేక గంటలు లెక్కన అద్దె ఫ్యాన్లు తెచ్చుకుంటున్నారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో బిడ్డల ఆరోగ్యం గురించి బాలింతలు భయపడుతున్నారు. ఇదీ నరసరావుపేట ప్రభుత్వాస్పత్రిలో దుస్థితి.



అద్దె ఫ్యాన్లు వినియోగించుకుంటున్న బాలింతలు

నరసరావుపేటటౌన్: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట ప్రభుత్వాస్పత్రిలో కనీస సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. అన్ని విభాగాల్లోనూ అరకొర సౌకర్యాలే రోగులకు స్వాగతం పలుకుతున్నాయి. ప్రతిరోజూ పల్నాడు బస్టాండ్ వద్ద గల పాత ప్రభుత్వ వైద్యశాల గైనిక్ విభాగానికి వైద్య సేవల కోసం సుమారు 120 నుంచి 150 మంది వరకు వస్తుంటారు. వీరిలో ఇన్ పేషెంట్‌లుగా 70 మంది ఉంటారు. ప్రతి రోజూ 10 కాన్పులు అవుతుంటాయి. ఇన్ పేషెంట్ రోగులకు ఇక్కడ చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా గైనిక్ విభాగాన్ని పట్టించుకునే నాథుడు లేక గర్భిణులు, బాలింతలకు కఠిన పరీక్షలు ఎదురవుతున్నాయి.

గైనిక్ వార్డులో తిరగని ఫ్యాన్లు

ప్రధానంగా గైనిక్ వార్డులో ఫ్యాన్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటి గురించి వైద్యులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో బాలింతలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు ఫ్యాన్లను అద్దెలకు ఇస్తూ వ్యాపారం చేసుకుంటున్నారు. అప్పుడే పుట్టిన పసికందు ఫ్యాన్లు లేకపోవడంతో ఊపిరాడక ఏడుపు లంకించుకుంటే.. వారిని ఓదార్చలేక ఆ బాలింతలు తల్లడిల్లిపోతున్నారు. ఇక చేసేదేమీ లేక బయట వ్యాపారుల వద్ద రోజుకు రూ.150 అద్దెకు ఫ్యాన్లు తెచ్చుకుంటున్నారు. అద్దె కట్టలేని వారు ఇంటి నుంచి టేబుల్ ఫ్యాన్లను తెచ్చుకొని వినియోగించుకుంటున్నారు. దీనిపై ఆస్పత్రి అధికారులను ప్రశ్నిస్తే ఫ్యాన్లు తిరగడం లేదు.. మేమేమి చేయాలంటూ నిర్లక్ష్యంగా చెబుతున్నారని బాలింతల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వైద్యశాలకు వచ్చే ప్రధాన మార్గంలో మురుగు

అస్తవ్యస్తంగా డ్రైనేజ్ వ్యవస్థ..

వైద్యశాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. తరుచూ డ్రెయిన్ నిండి మురుగు రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో వైద్యశాల ప్రాంగణం అంతా దుర్గంధం వెదజల్లుతుంది. వైద్యశాల వెలుపలకు వచ్చే ప్రధాన మార్గంలో డ్రెయిన్ ఉండటంతో రోగులు, వారి సహాయకులు దుర్వాసనకు ముక్కు మూసుకొని రావాల్సి వస్తుంది. ఉన్న రోగాలకు తోడు దుర్గంధంతో కొత్త రోగాలు వస్తున్నాయని గర్భిణులు వాపోతున్నారు. దీర్ఘకాలికంగా డ్రెయినేజీ సమస్య ఉన్నప్పటికీ పరిష్కారం చూపేందుకు అధికారులు దృష్టి సారించలేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి.

షార్ట్ సర్క్యూట్‌తో సమస్య



ఇటీవల కురిసిన వర్షాలకు షార్ట్ సర్క్యూట్ సంభవించి ఫ్యాన్లు కాలిపోయాయి. మరమ్మతులు చేసి త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తాం. డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

–డాక్టర్ మంత్రూ నాయక్, సూపరింటెండెంట్

మూడు రోజులే మిగిలింది

ముంచుకొస్తున్న గడువు

- ఈ-పంట నమోదుకు ఈనెల 15 వరకే అవకాశం
- సంక్షేమ పథకాలన్నింటికి అదే ప్రామాణికం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



సత్తెనపల్లి: టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుంది. ఎన్నికల ముందు పెట్టుబడి సాయం (అన్నదాత సుఖీభవ) రూ.20 వేలు అందజేస్తామని ఇచ్చిన హామీపై నేటికీ ఊసేత్తని టీడీపీ ప్రభుత్వ తీరు ఇందుకు సాక్ష్యం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి తొలి ప్రాధాన్యమిస్తూ అమలు చేసిన ఈ-క్రాప్ నమోదు రైతులకు వరంగా నిలుస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంట నమోదు ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ-పంట నమోదు ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారులు శరవేగంగా కొనసాగిస్తున్నారు. జూలై 28 ఈ ప్రక్రియ ప్రారంభమవ్వగా ఇప్పటివరకు సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా 86.90 శాతం పూర్తయినట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి. సంక్షేమ పథకాలన్నిటికీ ప్రామాణికంగా తీసుకునే ఈ-పంట నమోదుకు ఈనెల 15వ తేదీ వరకే అవకాశమివ్వడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అంటే ఇక రెండు రోజులు మాత్రమే మిగిలింది. ఈ రెండు రోజుల్లో అధికారిక లెక్కల ప్రకారం 14 శాతం ఈ-పంట నమోదయ్యే పరిస్థితి లేదు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో ప్రస్తుత ఖరీఫ్‌లో 1,01,570 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా ఇప్పటి వరకు 88,265 ఎకరాల్లో ఈ-పంట నమోదైంది. రెవెన్యూ డివిజన్‌లో ముఖ్యంగా పత్తి, వరి, తదితర పంటలు సాగయ్యాయి. వివిధ కారణాలతో పంట నష్టం జరిగితే పరిహారం అందించాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ-పంట నమోదు గడువు పెంచాలని రైతులు కోరుతున్నారు.

ఈ-పంట నమోదుతో ప్రయోజనాలు

రైతులు తమ పంటసాగును ఈ-పంటలో నమోదు చేయించుకుంటే పంట బీమా, నష్టపరిహారం, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, రాయితీపై ఎరువులు, పురుగుమందులు, యంత్ర పరికరాలు, పెట్టుబడి సాయం, ఉచిత బోర్ల మంజూరు సులభతరం అవుతాయి. ఈ-పంటలో భాగంగా రైతు సేవా కేంద్రంలో ప్రతి రైతు భూమి వివరాలు, గ్రామం, సర్వేనెంబర్, ఆధార్ వివరాలు నమోదు చేయించుకోవాలి. దీంతో పంట విక్రయించే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పుతుంది. ఈ-పంటలో భాగంగా కౌలు రైతులు తమ పేర్లను ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పంటల వివరాలు వ్యవసాయ శాఖ గ్రామస్థాయి అసిస్టెంట్ ఈ-పంట విధానంలో నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారు.

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లో ఈ-పంట వివరాలు

మండలం	పంటసాగు ఎకరాలు	ఈ-పంట నమోదు	శాతం
సత్తెనపల్లి	16,482	15,071	91
ముప్పాళ్ళ	3,334	3,087	93
రాజుపాలెం	8,896	8,623	97
నకరికల్లు	9,427	9,319	99
పెదకూరపాడు	12,708	10,646	84
అమరావతి	18,051	14,076	78
అచ్చంపేట	12,622	10,771	85
క్రోసూరు	12,098	9,248	76
బెల్లంకొండ	7,952	7,424	93
మొత్తం	1,01,570	88,265	86

గుంటూరు జిల్లాలో ప్రాథమిక నష్టం రూ.107.76 కోట్లు

కేంద్ర బృందానికి వివరించిన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరువెస్ట్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా రైతులు, ప్రజలు దారుణంగా నష్టపోయారని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర మినిస్ట్రీరియల్ సెంట్రల్ బృందం జిల్లాకు వచ్చింది. బృంద సభ్యులతో గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ముందుగా నష్టపోయిన పొలాలు, చనిపోయిన పశువులు, పాడైపోయిన వాహనాలు, చిరు బండ్లు తదితర అంశాలతో ఫొటో ప్రదర్శనను సభ్యులకు చూపించారు. అనంతరం కేంద్ర బృందంతోపాటు వివిధ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వరద నష్టం ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.107.76 కోట్లు ఉందని పేర్కొన్నారు. మరికొద్ది రోజుల్లో పూర్తి అంచనాలు వస్తాయని, అప్పుడు మరింత పెరిగే అవకాశముంటుందని తెలిపారు.

ఒక్క రోజులో అంతా మారిపోయింది

కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 30, 31 తేదీల్లో 220.3 ఎం.ఎం. భారీ వర్షం కురిసిందని తెలిపారు. దీనికితోడు కృష్ణా నదికి వచ్చిన 11.43 లక్షల క్యూసెక్కులతో 11 మండలాల్లోని 25 గ్రామాలు, నాలుగు పట్టణాలు, 38 వార్డులు దెబ్బతిన్నాయని వివరించారు. ఒక్క రోజులోనే జిల్లా మొత్తం అతలాకుతలమయ్యిందని చెప్పారు. వరద కారణంగా ఏడుగురు మరణించారని పేర్కొన్నారు. ముంపు ప్రాంతాల నుంచి 3091 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని వివరించారు. 43 పునరావాస కేంద్రాల్లో 7,365 మందికి ఆహారం అందించామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, పక్కన కేంద్ర బృందం సభ్యులు

క్లుప్తంగా

వైఎస్సార్ విగ్రహ దిమ్మె పగలకొట్టే ప్రయత్నం



తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే పచ్చ నేతల ఆగడాలకు అంతే లేకుండా ఉంది. చిర్రావూరులోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని పగలకొట్టేందుకు ప్రయత్నం చేశారు. పాక్షికంగా చేతులు పగలకొట్టి కొంతమేర ధ్వంసం చేశారు. తిరిగి గురువారం తెల్లవారుజామున కూటమి కార్యకర్తలు వినాయక నిమజ్జన సందర్భంగా నూతక్కి ప్రాతూరు రోడ్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద దిమ్మెకు ఉన్న గ్రానైట్‌ను పగలకొట్టడంతో పాటు చుట్టూ స్టీల్ రైలింగ్‌ను ధ్వంసం చేశారు. గతంలో ఎవరైతే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారో వారే ఈ పని చేసి ఉంటారని వైఎస్సార్ సీపీ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సొసైటీ మాజీ అధ్యక్షులు చిర్రావూరు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మేకల సాంబశివరావు మాట్లాడుతూ గతంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన సమయంలో గ్రామ పెద్దలు ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూద్దామని చెప్పడంతో తాము ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. అభివృద్ధి శిలాఫలకాలను కూడా ఇదే విధంగా పగలకొట్టారన్నారు. ఒకే ప్రభుత్వం ఎల్లకాలం ఉండదని, కూటమి నేతలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. విగ్రహ ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. వెంటనే స్పందించి దుశ్చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసుల్ని కోరారు.

సౌత్ ఏషియన్ అథ్లెటిక్స్ పోటీలకు హిమతేజ ఎంపిక



మంగళగిరి: మండలంలోని నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థి వి. హిమతేజ సౌత్ ఏషియన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు యూనివర్సిటీ డైరెక్టర్ ధీరజ్ గురువారం తెలిపారు. చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 12నుంచి జరిగే పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. 4 X 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో హిమతేజ ప్రతిభ కనబరచి ఏషియన్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

రైళ్లలో వరుస దోపిడీలు

- బెదిరించి చోరీలకు పాల్పడుతున్న దుండగులు
- నడికుడి రైల్వే జంక్షన్ సమీపంలో వరుస ఘటనలు
- రైలు ప్రయాణమంటే భయపడుతున్న ప్రయాణికులు



నడికుడి రైల్వే జంక్షన్ సమీపంలో చోరీలు జరుగుతున్న ప్రాంతం

దాచేపల్లి : రైలు ప్రయాణం సుఖమయం, సురక్షితం అనేది ప్రయాణికుల భావన. సుదూర ప్రయాణాలకు రైలుకే మొదటి ప్రాధాన్యత ఇస్తారు. కానీ ఇటీవల రైళ్లలో జరుగుతున్న వరుస దోపిడీలతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. సాధారణ ప్రయాణికుల మాదిరిగా ప్రయాణిస్తూ అదును చూసుకుని నగలు, నగదు దోచుకుని ఉడాయిస్తున్నారు. దీంతో ఎవరు దొంగలో, ఎవరు ప్రయాణికులో తెలియక కంటి మీద కునుకు ఉండడం లేదు.

చోరీలకు అడ్డాగా నడికుడి జంక్షన్

నడికుడి జంక్షన్ దోపిడీలకు అడ్డాగా మారింది. ఆగష్టు 11న నర్సాపూర్, సెప్టెంబర్ 6వ తేదీన చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో చోరీలు జరిగాయి. రెండూ శుక్రవారమే జరగటం విశేషం. నడికుడి రైల్వేస్టేషన్‌లో రైలు ఆగి తిరిగి ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే ఈ చోరీలు జరుగుతున్నాయి. ప్రధానంగా నడికుడి జంక్షన్ మీదుగా సికింద్రాబాద్ వెళ్లే క్రమంలోనే చోరీలు జరుగుతున్నాయి. రైళ్లలో ప్రయాణికుల నుంచి నగలు, నగదు దోచుకున్న దుండగులు రెండు బోగీల మధ్య ఉన్న చైన్‌లాగి నడికుడి రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద దిగి తప్పించుకుంటున్నారు. గత నెల 11వ తేదీన నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో దుండగులు దోపిడీ చేసిన అనంతరం రైలుపై రాళ్లు విసిరారు. తాజాగా చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన దోపిడీలో నగదు దోచుకుని ఉడాయించారు.

భద్రత అంతంతమాత్రమే...

రైలులో భద్రత అంతంత మాత్రంగానే ఉంటుంది. ముగ్గురు, నలుగురు మాత్రమే పోలీసులు విధులు నిర్వర్తిస్తుంటారు. ఆరుగురు అంతకంటే ఎక్కువ మంది దుండగులు రైళ్లల్లో చొరబడి ప్రయాణికులను మరణాయుధాలతో బెదిరించి నగలు, నగదు దోచుకుని పరారైపోతున్నారు. రైలులో ఉండే పోలీసులకు సమాచారం తెలిసే లోపే దుండగులు రైలు దిగి పారిపోతున్నారు. ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు తలపెట్టే వారిని కాల్చిపారేసే అధికారాలు రైలులో విధులు నిర్వర్తించే పోలీసులకు ఉన్నప్పటికీ వారు వచ్చేసరికల్లా దుండగులు సురక్షితంగా తప్పించుకుంటున్నారు. కేవలం రిజర్వేషన్ బోగీలను ఎంచుకుని ఈ చోరీలు జరుగుతున్నాయి.

నిఘా పటిష్టం చేయాలి:

రైలు ప్రయాణికుల భద్రతకు ఇంకా పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా రాత్రి సమయాల్లో రైళ్లల్లో నిఘా వ్యవస్థను పటిష్టం చేయాల్సి ఉంది. రైలులో ఎక్కువ మంది పోలీసులు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవటంతో పాటుగా ప్రతి బోగీని క్షుణ్ణంగా పరిశీలన చేయాలి. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైలు ప్రయాణికుల భద్రతను గాలికొదిలేస్తే రైల్వేశాఖ భారీగా నష్టాలను చవిచూడాల్సి వస్తుందని ప్రయాణికులు అంటున్నారు.

15 లోపు ఈ-క్రాప్‌ను పూర్తిచేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి మురళి



మాట్లాడుతున్న డీఏవో మురళి

నరసరావుపేటరూరల్: ఖరీఫ్‌లో ఈ-క్రాప్ నమోదును ఈనెల 15వ తేదీ లోగా పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బందికి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్యాల పెంపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మురళి మాట్లాడుతూ సాగర్ నుంచి నీటి విడుదల నేపథ్యంలో వరి సాగు జిల్లాలో విస్తారంగా చేపడుతున్నట్టు తెలిపారు. ప్రస్తుతం నాట్లు సీజన్ ప్రారంభమయిందన్నారు. వరి నాట్లు వేసిన పొలాలను ఎప్పటికప్పుడు ఈ-క్రాప్ నమోదు చేయాలని తెలిపారు. జిల్లాకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. వరి సాగు నేపథ్యంలో అక్టోబర్ నెలలో ఎరువులకు డిమాండ్ ఉంటుందని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉండేలా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. పత్తిలో గులాబీరంగు పురుగు పట్ల రైతుల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. లింగాకర్షక బుట్టలతోపాటు పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటుచేసుకోని పురుగు ఉధృతిని బట్టి నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంటలలో పురుగు, తెగులు ఉధృతిని వ్యవసాయ సిబ్బంది ఎప్పటికప్పుడు గుర్తించి క్రాప్ లైఫ్ సిస్టమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. దీంతోపాటు వరిలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. వరిలో వంగడాలు గురించి డాట్ సెంటర్ కోఆర్డినేటర్ వెంకటరాములు తెలియజేశారు. వరిలో వచ్చే పురుగులు, తెగుళ్లు వాటి నివారణ చర్యలు, పురుగులు చేసే నష్టాన్ని వివరించారు. క్రాప్ లైఫ్ సిస్టమ్ యాప్‌ను ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోని ఏవిధంగా వినియోగించాలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పి.ప్రవీణ్ తెలియజేశారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి, ప్రకృతి వ్యవసాయ డీపీఎం అమలకుమారి, ఏడీఏ పి.మస్తానమ్మ, ఏవో సురేంద్రబాబు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లకు పని అవకాశం

బాపట్ల: విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రభుత్వం తరఫున పని చేయడానికి ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు అత్యవసరంగా కావాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ - కృష్ణా జిల్లా విభాగం ఆధ్వర్యంలో రోజుకు కనీసం రూ.వెయ్యి జీతం, అదనంగా రోజువారీ పనికి ధరల పట్టిక అనుసరించి నగదు చెల్లింపులు ఉంటాయని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, పని నైపుణ్యానికి సంబంధించి సర్టిఫికెట్ / స్కిల్ సర్టిఫికెట్ / లేబర్ సర్టిఫికెట్ / ఈ-శ్రమ్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరవ్వాలని సూచించారు. అభ్యర్థులకు కచ్చితంగా సొంత టూల్ కిట్ ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు 89788 86348 (రవి కిరణ్), 85559 01198 (నాగ వెంకట్)ను సంప్రదించాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు వెంటనే సంప్రదించాలన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల ఉద్యమ బాట



జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ రవికి వినతి పత్రం అందిస్తున్న నరసరావుపేట, సత్తెనపల్లి డివిజన్లలోని పీహెచ్‌సీ వైద్యులు

- దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేయనున్న వైద్యులు
- క్లినికల్ కోటాలో 30 శాతం, నాన్ క్లినికల్ కోట 50 శాతం పెంచాలని డిమాండ్
- పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఏపీ పీహెచ్‌సీడీఏ వినతి పత్రం అందజేత

సత్తెనపల్లి: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీల్లో) పనిచేసే వైద్యులు పీజీ విద్యను అభ్యసించేందుకు ఇచ్చే ఇన్ సర్వీస్ కోటాను ప్రభుత్వం తగ్గించడంతో వారంతా ఉద్యమ బాట పట్టారు. తమ డిమాండ్ నెరవేర్చక పోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. గతంలో ఉన్న ఇన్ సర్వీస్ కోటాను తగ్గించడం పట్ల మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులు ఈ నెల 9 నుంచి నల్లరిబ్బన్‌లు ధరించి విధులకు హాజరవుతున్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 18వ తేదీ వరకు నిరవధిక నిరాహార దీక్షలకు దిగుతామని స్పష్టం చేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం నరసరావుపేట, సత్తెనపల్లి డివిజన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు 15 మంది ఏపీ పీహెచ్‌సీడీఏ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవిని కలిసి వినతి పత్రం అందించారు.

ఇన్ సర్వీస్ కోటా తగ్గింపు...

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటాను ప్రభుత్వం తగ్గిస్తూ జీవో నెంబర్ 85ను జారీ చేసింది. గతంలో ఇన్ సర్వీస్ కోటా క్లినికల్ 30 శాతం ఉంటే దాన్ని 15 శాతానికి తగ్గించారు. నాన్ క్లినికల్ కోటాను 50 శాతం నుంచి 30 శాతానికి తగ్గించారు. గతంలో మాదిరి క్లినికల్ కోటాను 30 శాతానికి, నాన్ క్లినికల్ కోటాను 50 శాతానికి పెంచాలని వైద్యులు కోరుతున్నారు. ఇన్ సర్వీస్ కోట తగ్గిస్తూ ఇచ్చిన జీవో 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ అకస్మాత్తుగా జీవో ఇవ్వడం అన్యాయమని వాపోతున్నారు. ఈ జీవో వల్ల తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. జీవోను రద్దు చేయాలని పాలకులు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన ప్పటికీ స్పందన లేకపోవడంతో ఉద్యమ బాట పట్టారు.

జీవో 85 తక్షణమే రద్దు చేయాలి

ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 85ను తక్షణమే రద్దు చేయాలి. ఇన్ సర్వీస్ కోటా క్లినికల్ 30 శాతం, నాన్ క్లినికల్ 50 శాతం యథాతథంగా అమలు చేయాలి. ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తే నష్టం కలుగుతుంది.ఆయా డిమాండ్ల సాధనకు ఈ నెల 15న విజయవాడలో ర్యాలీ, 16న నిరవధిక నిరాహారదీక్షకు దిగనున్నాం.

–డాక్టర్ వి.ప్రదీప్, వైద్యుడు, ఫణిదం పీహెచ్‌సీ

మట్టి వినాయకా.. మనసా స్మరామి

- 6వ రోజు ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ
- పోటెత్తిన భక్త జన సందోహం

సత్తెనపల్లి: పర్యావరణ హితమే లక్ష్యంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని నాగార్జుననగర్‌లోగల శ్రీశ్రీ నగర్‌లో ఏర్పాటు చేసిన 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద గురువారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి యువజన సంఘం ఆధ్వర్యంలో సినీ ఆర్ట్ డైరెక్టర్ వీరాంజనేయులు పర్యవేక్షణలో వినాయక నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. దీనిలో భాగంగా 6వ రోజు గురువారం 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద పూజల అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. సుమారు ఏడు నుంచి ఎనిమిది వేల మందికి పైగా భక్తులు అన్నసంతర్పణకు హాజరైనట్లు అంచనా. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై క్యూలైన్‌లో స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఆటంకం కలుగకుండా శ్రీ సత్యసాయి యువజన సంఘం అధ్యక్షుడు సాయి తేజ రాజు నేతృత్వంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సత్తెనపల్లిలో 61 అడుగుల మట్టి వినాయకుడిని పూజిస్తున్న భక్తులు

సెంట్రల్ జోన్ మ్యాచ్‌లో పరుగుల వరద

నరసరావుపేటఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అండర్-23 క్రికెట్ పోటీలలో పరుగుల వరద పారింది. ఈనెల 2వ తేదీన వర్షం కారణంగా నిలిచిపోయిన పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల మ్యాచ్ తొలిరోజు ఆట వర్షార్పణం కాగా గురువారం రెండవ రోజు ఆట ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 342 పరుగులు చేసింది. జట్టులోని ఎం.అభినవ్ 159 బంతుల్లో 123, పి.దుర్గాబాలాజీ 185 బంతుల్లో 115 పరుగులతో సెంచరీలు సాధించారు. మరో బ్యాట్స్‌మెన్ ఎస్.అఖిల్ 36 బంతుల్లో 18 పరుగులు చేశాడు. పశ్చిమగోదావరి బౌలర్ ఎం.హర్షవర్ధన్‌కు ఒక వికెట్ లభించింది. శుక్రవారం మూడవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.



పి.దుర్గాబాలాజీ



ఎం.అభినవ్

జాతీయ స్థాయిలో కేంద్రియ విద్యార్థినుల ప్రతిభ

సత్తెనపల్లి: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని కేంద్రియ విద్యాలయ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 6 నుంచి 10 వరకు గురుగావ్ రీజియన్ అంబాల (హరియాణా)లో జరిగిన 53వ జాతీయ వాలీబాల్ సమ్మిట్‌లో 25 రీజియన్‌లలో సత్తెనపల్లి కేంద్రియ విద్యాలయ విద్యార్థినులు విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపల్ జగదీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ఇంతటి ఘన విజయానికి విద్యాలయ పీఈటీ బి కిరణ్‌రెడ్డి కృషి ఎంతగానో ఉందని అభినందించారు. విద్యార్థినులు పట్టుదలతో కృషి చేశారన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి చేరుకోవడానికి వారి కృషి, పట్టుదల ఎంతో గొప్పదన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులు కె త్రిపుర నాగ తేజస్విని, ఆర్ స్వీటి భాయ్, ఎస్.శ్రీలక్ష్మి, జి.సరోజినీలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ జగదీష్ కుమార్ గుప్తా

కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన

గుంటూరుమెడికల్: గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు గురువారం విధులు బహిష్కరించి ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నెంబర్ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించి తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం 15 ఏళ్లుగా రెగ్యులర్ స్టాఫ్‌నర్సు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం వల్ల నర్సింగ్ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. తమ పోస్టుల్లో ఏఎన్‌ఎంలను సర్దుబాటు చేసేలా ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 115ను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు గురువారానికి ఎనిమిదోరోజుకు చేరుకున్నాయి. ప్రభు త్వం జీఓను ఉపసంహరించుకునేవరకు, తమ ను రెగ్యులర్ చేసే వరకు తమ నిరసన కొనసాగుతుందన్నారు.

ఏపీటీఎఫ్‌ను జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేస్తాం

- ఫెడరేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు సంపత్‌బాబు
- పల్నాడు జిల్లా ఇన్‌చార్జిగా కొమ్ము కిషోర్



విలేకరులతో మాట్లాడుతున్న సంపత్ బాబు

మాచర్ల: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్)ను బలోపేతం చేసేందుకు మండలాలు, నియోజకవర్గాల్లో కమిటీలను నియమిస్తూ ఉపాధ్యాయ సమస్యల పై ఉద్యమించేందుకు తమ సంఘం ప్రత్యేక కృషి జరుపుతున్నట్లు ఆ సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు బి సంపత్‌బాబు, జిల్లా ప్రధానకార్యదర్శి పమ్మి వెంకటరెడ్డిలు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా గురువారం మాచర్ల వచ్చిన వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1938లో ఏర్పడిన ఏపీటీఎఫ్ 20వ విద్యా, వైజ్ఞానిక మహాసభలు, 80వ వసంతాల వేడుకలను అక్టోబర్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసి పలు విజయాలు సాధించామని తెలిపారు. సంఘాన్ని బలోపేతం చేసేందుకు నియోజకవర్గ, మండల కమిటీలు నియమిస్తున్నామన్నారు. పలువురు ఉపాధ్యాయులు ముందుకు రావటం మంచి పరిణామమన్నారు. మాచర్లకు చెందిన కొమ్ము కిషోర్‌ను పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జిగా నియమించినట్లు తెలిపారు. మాచర్ల, దుర్గి, వెల్దుర్తి మండలాలకు నూతన కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏపీటీఎఫ్‌లో సభ్యులు చేరాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ నాయకులు విజయానంద్, కె పోతురాజు, సుధాకర్, చైతన్య భారవి, ఎ సునీల్‌కుమార్, అనిల్, రిటైర్డ్ హెచ్‌ఎం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

- గుంటూరు జిల్లా జేసీ భార్గవ్ తేజ
- పారదర్శకంగా కార్యకలాపాలు నిర్వహించండి
- నవంబర్ నాటికి పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ నికర లాభం రూ.21.94 కోట్లు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

కొరిటెపాడు(గుంటూరు): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని సహకార సంఘాల్ని బలోపేతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, జీడీసీసీ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి ఎ.భార్గవ్ తేజ కోరారు. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(జీడీసీసీబీ) మహాజన సభ సమావేశాన్ని గురువారం బ్రాడీపేటలోని జీడీసీసీ బ్యాంక్ సమావేశ మందిరంలో సీఈఓ కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా 2023-24 సంవత్సరం ఆడిట్ రిపోర్టు, జమ, ఖర్చుల పట్టికను సభ ముందు సీఈఓ కృష్ణవేణి ఉంచారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జులు ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. సంఘ పరిధిలో అవకతవకలు జరిగితే వారే బాధ్యులని హెచ్చరించారు. సహకార చట్టం, నాబార్డు నార్మ్స్, నిబంధనలకు అనుగుణంగా వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని సూచించారు. గుంటూరు జిల్లాలోని సహకార బ్యాంకులు, పీఏసీఎస్‌లపై మంచి అభిప్రాయం లేదని పేర్కొన్నారు. అక్టోబర్, నవంబర్ నాటికి అన్ని జీడీసీసీ బ్యాంక్‌లు, పీఏసీఎస్‌లలో కోర్ బ్యాంకింగ్ సిస్టమ్(కంప్యూటరీకరణ)లోకి రానుందని చెప్పారు. సకాలంలో వీలైనంత ఎక్కువ మంది రైతులకు రుణాలివ్వడంతో పాటు వసూలు కూడా అంతే స్థాయిలో చేయాలని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీడీసీసీ బ్యాంక్ రూ.21.94 కోట్లు నికర లాభాన్ని ఆర్జించినట్లు వెల్లడించారు. అందరి సహకారంతో గుంటూరు జిల్లా సహకార బ్యాంక్‌ను రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేద్దామని సూచించారు. సమావేశంలో పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జులు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో బాపట్ల విద్యార్థి ప్రతిభ

వేటపాలెం: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బాపట్ల జిల్లాకు చెందిన విద్యార్థి ప్రతిభ చాటాడు. సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీకి చెందిన ఖాదర్ వలి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ మేరకు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావులు గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు మాల్టా-2024లో ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారన్నారు. కళాశాలలో ఎంబీఏ చదువుతున్న సయ్యద్ ఖాదర్ వలి ఈ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. తద్వారా రాబోయే కామన్‌వెల్త్ పోటీలకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థికి రూ.30 వేల నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ కె. జగదీష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు, ఎంబీఏ విభాగాధిపతి ఆర్ ఇమ్మానియేల్, అక్రిడిటేషన్స్ డైరెక్టర్ సి.సుబ్బారావు, వివిధ విభాగాల అధ్యాపకులు అభినందించారు.